నిలిచిన బీటీ పనులు

- కంకరపరిచి వదిలేసిన వైనం
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



కంకర పరిచి వదిలేసిన ఉంద్యాల రోడ్డు

చిన్నచింతకుంట: మండల కేంద్రం నుంచి ఉంద్యాల వరకు 5 కిలోమీటర్ల మేరా బీటీ రోడ్డు చేపట్టేందుకు 2021లో ప్రభుత్వం పంచాయతీరాజ్ నిధుల నుంచి రూ.3.32కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను అధికారులు అప్పట్లోనే ప్రారంభించారు. కాగా కంకర పరిచి పనులు వదిలేశారు. దీంతో మూడేళ్లుగా వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

అదుపుతప్పి ప్రమాదాలు

ఈ రోడ్డు మార్గాన ప్రయాణించే చిన్నచింతకుంట, ఉంద్యాల ప్రజలతోపాటు కొత్తకోట, రాయచూరు జాతీయ రహదారులకు చేరుకునే నర్వ, అమరచింత, మదనాపురం, మక్తల్, కొత్తకోట మండలాల వారికి తిప్పలు తప్పడం లేదు. కంకర పరిచిన రోడ్డుపై ప్రజలు వాహనాల మీద ప్రయాణిస్తు అదుపు తప్పి ప్రమాదాలకు గురైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అంతేకాక ఉంద్యాలకు బస్సులు, ఆటోలు, రాలేని పరిస్థితి ఏర్పడింది. అంబులెన్స్ సైతం ఊర్లోకి రాక పోవడంతో వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు వైద్యానికి నోచుకోలేకపోతున్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి మండల కేంద్రానికి చేరుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామస్తులు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని రోడ్డు పనులు పూర్తిచేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు మారిన రోడ్డు పనులు పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



ఉంద్యాల, చిన్నచింతకుంటకు చేపట్టిన బీటీ రోడ్డు పనులను ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. దీంతో గ్రామానికి బస్సులు, ఆటోల రాకపోకలు నిలిచాయి. బైక్‌లపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు త్వరగా పూర్తి చేయాలి.

– రవి, ఉంద్యాల

అధికారుల నిర్లక్ష్యం



ఈ బీటీ రోడ్డు పనులు అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే నిలిచిపోయాయి. మూడేళ్లుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరగా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని అంటున్నారు. విషయాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం.

– వెంకటేష్, ఉంద్యాల

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం..

ఉంద్యాల బీటీ రోడ్డు పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. వారి ఆదేశానుసారం పనులను త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తాం.

–సత్యకృష్ణ, ఏఈఈ పంచాయతీరాజ్, మహబూబ్‌నగర్

రెవెన్యూ సమస్యలు తీర్చేందుకు కృషి



గాధిర్యాల్‌లో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ తిరుపతయ్య

మహమ్మదాబాద్: ధరణిలో కూడా పరిష్కారం కాని సమస్యలపై గ్రామాల్లో రెవెన్యూ అధికారుల ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ తిరుపతయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రం, గాధిర్యాల్లో రెవెన్యూ సమస్యలపై సమావేశాలను ఏర్పాటు చేశారు. పట్టాభూముల సర్వేనంబర్ల గల్లంతు, డిజిటల్ సంతకాలు కానందున, సర్వేనంబర్లలో కొంత భూమి ఎక్కువగా ఆన్‌లైన్‌లో నమోదు, ఒకరి పేరున ఉన్న భూములు మరొకరి పేరున పడి ఇలాంటి సమస్యలతో ఎంతో మంది రైతులు ఇబ్బందులను సరిచేసుకునేందుకు పరిష్కారాలను రైతులకు తెలియజేశారు. పాత పహాణీలను చూసి భూమి ఎలా వచ్చిందన్న వివరాలను సేకరించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ యాదయ్య, వెంకట్రాంరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి హాజీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల కమిటీలు

అడ్డాకుల: మూసాపేట మండల యూత్ కాంగ్రెస్ కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షులుగా హరీష్‌సాగర్, నర్సింహ, గణేష్‌యాదవ్, సురేందర్, ప్రధాన కార్యదర్శులుగా రవికుమార్, గణేష్‌గౌడ్, బ్రహ్మయ్య, శివ, ప్రవీన్‌కుమార్‌రెడ్డి, రామాంజనేయులు, నాగరాజు, కార్యదర్శులుగా నగేష్, శివకుమార్, మహేందర్, నర్సింహ్మానాయక్, వెంకటేష్ యాదవ్, మహేశ్వర్, ప్రభాస్‌రెడ్డి, హరిశంకర్‌గౌడ్, మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా మురళీని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు.

మిడ్జిల్: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గోద కృష్ణను నియమిస్తూ సోమవారం డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు.

నవాబుపేట: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్‌ను ఎంపిక చేశారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించే కార్యక్రమం చేపట్టాలని జిల్లా నాయకులు సూచించారు.

జోరుగా 'ఉపాధి' పనులు

దేవరకద్ర: మండలంలో జోరుగా ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. వేసవి ప్రారంభం కావడంతో పనుల్లో వేగం పుంజుకుంది. స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న మల్లెల పాపయ్య కుంటలో సిల్టు తీసే పనులు సోమవారం చేపట్టారు. 89 మంది ఉపాధి కూలీలు పనుల్లో పాలు పంచుకున్నారు. కుంటలో పేరుకుపోయిన సిల్టును తవ్వి కట్టను బలోపేతం చేస్తున్నారు. పనులను పంచాయతీ ఈఓ సీత్యానాయక్ పర్యవేక్షణ చేశారు.



మల్లెలపాపయ్యకుంటలో సిల్టు తొలగిస్తున్న కూలీలు

జానంపేటలో స్వపరిపాలన దినోత్సవం



జానంపేటలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటలో సోమవారం విశ్వభారతి ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎల్ల శివకుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో పీయూ విద్యార్థులు



పాలమూరు యూనివర్సిటీ ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు, ప్రొఫెసర్లు

నర్వ: గ్రామీణ ప్రజల జీవన పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు పాలమూరు యూనివర్సిటీ ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు సోమవారం మండలంలోని రాంపూర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే క్యాంప్‌ను విజయవంతం చేసేందుకు గ్రామంలోని యువకులు, విద్యార్థులు భాగస్వాములై సహకరించాలని కోరారు. యూనివర్సిటీ సోషల్ వర్క్ డిపార్టుమెంట్ అధ్యాపక బృందం ప్రొఫెసర్లు డా. బండి పర్వతాలు, డా.మాధురి, డా.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ అధ్యయనం ఉంటుందని వారు పేర్కొన్నారు. గ్రామంలోని ప్రజల జీవన పరిస్థితులు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యా, ఆరోగ్యం, అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాల సందర్శన, కులవృత్తులు, నిరుపేదల జీవనోపాధి, ఆర్థిక సర్వే, ఉపాధి పథకం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై అధ్యయనం చేసి గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. వీరి బృందానికి గ్రామ పీయూఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థి మాజీ ఉప సర్పంచ్ నాగరాజు, పవన్‌కుమార్‌రెడ్డి, వడ్డె శివకుమార్ సహకరిస్తామని తెలిపారు.

14న దళిత క్రిస్టియన్ దండోర గర్జన



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఈనెల 14న దళిత క్రిస్టియన్ దండోరా గర్జన నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకుడు నర్సింహులు తెలిపారు. సోమవారం అంబేద్కర్ కళాభవన్‌లో కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో దళితులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సామెల్, బాలరాజు, జాన్సన్, బాబు, తుంగ, శ్యాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్‌కు మహిళా సేవ వైభవరత్న అవార్డు



అవార్డును అందుకుంటున్న జానకమ్మ

బాలానగర్: ఇటీవల జడ్చర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన మండలంలోని పెద్దరేవల్లికి చెందిన ట్రాన్స్‌జెండర్ జానకమ్మ 'మహిళాసేవా వైభవరత్న' అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో సర్ సీవీ రామన్ అకాడమీ సేవ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల్లో భాగంగా అందించారు. తాను వివిధ రూపాల్లో సమాజానికి చేసిన సేవను గుర్తించిన అవా ర్డును అందించినట్లు ఆమె పేర్కొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ అజారుద్దీన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో సురక్ష పోలీస్ బృందం, మానవ అక్రమ రవాణా విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటి సమాజంలో మొబైల్ ఫోన్ వాడటం విద్యార్థులకు అలవాటుగా మారిందని, సోషల్ మీడియా ప్రభావం వల్ల ఫోన్ ప్రమాదకరంగా మారిందన్నారు. యువత వారి నైపుణ్యాల అనుగుణంగా కష్టించి పనిచేయాలని, అప్పుడు సమాజంలో మంచిగౌరవం లబిస్తుందన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని మానవహక్కుల పరిరక్షణ సభ్యుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు, వసతులు లేరని పేర్కొన్నారు. అంతేకాకుండా పేద విద్యార్థులకు 25శాతం రిజర్వేషన్‌ను ఏ పాఠశాలలు పట్టించుకోవడం లేదని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ స్పోర్ట్స్ కరాటేడూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో డ్రాగన్ షోటోకాన్ కరాటేడూ స్పోర్ట్స్ విద్యార్థులు ప్రతిభచాటినట్లు సీనియర్ కరాటే మాస్టర్ ఎస్‌కే.మోసీన్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో కుమితే విభాగంలో బాలికలు ఐశా తస్లీం, షాఫియ తస్లీం బంగారు పతకాలు సాధించి త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అదేవిధంగా ఆయా విభాగంలో మనోవికాస్, గాయత్రి మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఐ జయశేఖర్, కురుమూర్తి, నారాయణ, జెట్టి రామస్వామి, చెన్నయ్య, నీలయ్య, బీసీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను డ్రాగన్ షోటోకాన్ కరాటేడూ స్పోర్ట్ ఫౌండర్ సాలంబిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, మాస్టర్లు మోసీన్, ఫహీం అభినందించారు.

అక్రమ నీటి వాడకాన్ని అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పగిడ్యాల్ రైతులు

గండీడ్: చెరువు నుంచి అక్రమ నీటి వాడకాన్ని అరికట్టాలని రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లో వెళితే మండలంలోని పగిడ్యాల్ మల్లమ్మ చెరువు ఈసారి పూర్తి స్థాయిలో నిండలేదు. దీంతో ఉన్న నీటిని వదలకుండా అలాగే ఉంచారు. కొందరు చెరువులో అక్రమంగా మోటార్లు వేసి, చెరువులోని నీటిని ఆయకట్టుకు కాకుండా పైన ఉన్న చెల్కపొలాలను పారబెడుతున్నారని వాపోయారు. దీంతో ఉన్న నీరు కాస్త అడుగంటి పశువులకు తాగడానికి లేకుండా పోతుందని వాపోయారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. మోటార్లు సీజ్ చేయాలని, అక్రమ నీటి వాడకాన్ని అరికట్టాలని వారు కోరారు. అనంతరం తహసీల్దార్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, కావలి కృష్ణయ్య, కావాలి అంజి, బాబు, తిర్మలయ్య, కుమ్మరి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

యూబీఐ ఆధ్వర్యంలో వాకథాన్



వాకథాన్ నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపవర్‌హర్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో బ్యాంక్ రీజినల్ హెడ్ ఆర్.సత్యనారాయణ నేతృత్వంలో ప్రాంతీయస్థాయిలో వాకథాన్ చేపట్టారు. రీజినల్ హెడ్ మాట్లాడుతూ తమ మహిళా ఉద్యోగుల శ్రేయస్సు కోసం బ్యాంకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఇటీవలే సంస్థలోని మహిళా ఉద్యోగులకు కెరీర్ కౌన్సెలింగ్, స్కిల్ ట్రైనింగ్, గ్రూమింగ్‌తోపాటు సంపూర్ణమైన మద్దతు అందించే లక్ష్యంతో ఎంపవర్‌హర్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మహిళా శ్రామికశక్తి బ్యాంకింగ్‌లో అంతర్భాగంగా ఉందన్నారు. వారి కెరీర్ అభివృద్ధి కోసం బ్యాంక్ ఎంపవర్‌హర్‌లో భాగంగా అనేక ప్రత్యేక కార్యక్రమాలు అవలంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం మురళీ మోహన్, చీఫ్ మేనేజర్ రఘునయ్య, రీజినల్ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇది పరీక్షల కాలం..



నవాబుపేటలో పరీక్షకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

విద్యార్థులకు ఇబ్బందులు రవాణా కష్టాలు

నవాబుపేట: ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. ఇంకొన్ని రోజుల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఇతర తరగతులకు సైతం వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఏడాదంతతా చదివిన వారికి వార్షిక పరీక్షలు ఒత్తిడికి లోను కాకుండా రాయాల్సి ఉండగా తాజా పరిణామాలు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మండలంలో ఇంటర్ పరీక్ష రాసే విద్యార్థులు 709 మంది, అలాగే పదో తరగతికి సంబంధించి 1,200 మంది విద్యార్థులు ఉన్నారు. వీరు రవాణా సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇంటర్ విద్యార్థులకు ఉదయం 9గంటలకే పరీక్షలు ప్రారంభం కావటంతో వారికి రవాణా చాలా ఇబ్బంది.

పరీక్ష కేంద్రాలు..

మండలంలో ఇంటర్ పరీక్షలకు యన్మన్‌గండ్ల జూనియర్ కళాశాలలో కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 709 మంది పరిక్షలు రాయనున్నారు. పదో తరగతికి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, యన్మన్‌గండ్ల, కొల్లూర్ పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే మరికల్‌లో కొత్తగా మరో పరీక్ష కేంద్రం ఏర్పాటైంది. మొత్తం 16 ప్రభుత్వ పాఠశాలలు, 4 ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

సమస్యలు..

మండలంలో కొండాపూర్, రేకులచౌడాపూర్, లింగంపల్లి, హాజిలాపూర్, కారుకొండ, ఇప్పటూర్, అమ్మపూర్, కూచూర్, లోకిరేవు గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో ఇక్కడి నుంచి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయంలో చెప్పలేనన్ని ఇబ్బందులు. తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్ వాహనాలను పట్టుకుని రావాల్సి ఉంటుంది. కాగా పరిమితికి మించి ఎక్కువగా ఎక్కితే ప్రమాదాలు తప్పవు. గతేడాది ఇదే ఇంటర్ పరీక్షల సందర్భంగా లోకిరేవు నుంచి వస్తున్న ఆటో బోల్తా పడి విద్యార్థులకు గాయాలయ్యాయి.

రవాణా చాలా ఇబ్బంది..



గ్రామం నుంచి పరీక్షలకు పోవటం ఇబ్బంది. ఉదయం గ్రామాల నుంచి బస్సు సౌకర్యం లేదు. ప్రైవేట్ ఆటోలు పట్టుకుని వెళ్లాల్సి. గతంలో ప్రైవేట్ వాహనం మాట్లాడి అందరిని కలిపి పంపించాం. తాజాగా ఒక వాహనం పరీక్షల కోసం అద్దెకు మాట్లాడాలని అనుకున్నాం.

–చెన్నప్ప, విద్యార్థి తండ్రి, ఇప్పటూర్

తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి



ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసేలా చూస్తున్నాం. ప్రతి గదికి తాగునీటిని అందించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. నాలుగు గ్రామాల్లో ఐదు కేంద్రాలుగా విభజించి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం. రవాణా విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. బస్సులు లేని గ్రామాలతో ఇబ్బంది చాలా ఉంది.

– రాజునాయక్, ఎంఈఓ

ప్రమాదకరంగా స్పీడు బ్రేకర్లు



స్పీడ్ బ్రేకర్ వద్ద వెళ్లలేకపోతున్న కారు

బాలానగర్: మండలంలోని అప్పాజిపల్లి వద్ద జెడ్పీ రహదారిపై వేసిన స్పీడు బ్రేకర్ ప్రమాదకరంగా మారింది. బీటీ రోడ్డుపై అధికారులు వేసిన స్పీడు బ్రేకర్ సరిపోవడం లేదని, గ్రామస్తులు అదనంగా పెద్దగా వేశారు. అది గమనించని వాహనదారులు పలు మార్లు ప్రమాదాలబారిన పడుతున్నారు. కారు కిందిభాగంలో సదరు స్పీడు బ్రేకర్ తగులుతుండడంతో అటువైపుగా ప్రయాణించే సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అటువైపుగా వచ్చే కంకర పరిశ్రమ టిప్పర్లు ఓవర్ లోడ్ కారణంగా స్పీడు బ్రేకర్ వద్ద కంకర పడుతుండడంతో, వాటిని తప్పించబోయి సైతం పలువురు ద్విచక్రవాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పీడు బ్రేకర్ ఎత్తును తగ్గించే చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

బీజేపీ ఎంపీ టికెట్ బీసీలకే..

పాలమూరు: పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానం బీసీ అభ్యర్థికి కేటాయిస్తారని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థుల మొదటి జాబితా విడుదలైందని, తొమ్మిది స్థానాలు ప్రకటించగా మహబూబ్‌నగర్ స్థానం పెండింగ్‌లో ఉందని తెలిపారు. 65శాతం బీసీలు ఉన్న మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో బీసీ అభ్యర్థికి టిక్కెట్ ఇస్తే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని అధిష్ఠానం పరిశీలన చేస్తోందని, త్వరలో ప్రకటన చేస్తారని పేర్కొన్నారు.

ఐదు ఉద్యోగాలకు ఎంపిక



షర్మిలారెడ్డి

కోయిల్‌కొండ: ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ప్రతిఒక్కరూ నిరంతరం కష్టపడుతుంటారు. కానీ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గురుకుల ఫలితాల్లో మండలంలోని మల్కాపూర్ చెందిన షర్మిలారెడ్డి రెండు వేర్వేరు సబ్జెక్టులలో ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. ఈమె ఒక వైపు కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఉద్యోగం చేసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా, ఒకేసారి ఐదు ఉద్యోగాలు గురుకుల జేఎల్ కెమిస్ట్రీ, జేఎల్ జువాలజీ, పీజీటీ ఫిజికల్ సైన్స్‌గా, టీజీటీ ఫిజికల్ సైన్స్‌గా, టీజీటీ బయోలాజికల్ సైన్స్‌లలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

టెట్, డీఎస్సీ రాసేందుకు అవకాశం ఇవ్వాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డైట్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ సంవత్సరం టెట్, డీఎస్సీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించాలని డైట్ కళాశాల విద్యార్థులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కరోనా కారణంగా విద్యా సంవత్సరం ఆగస్టులో ప్రారంభం కావాల్సి ఉండగా డిసెంబర్‌లో ప్రారంభమైందని, తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఉత్సవాలకు విరాళం

దేవరకద్ర: మండలంలోని వెంకటాయపల్లిలో శివరాత్రి సందర్భంగా నిర్వహించే మల్లన్న ఉత్సవాలకు జీకేఆర్ ఫౌండేషన్ తరపున రూ. 10,216 విరాళం అందజేశారు. కోన మాజీ ఎంపీపీ భారతమ్మ, గోపాల్ పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

దేవరకద్ర: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన చిన్నరాజు గురుకుల టీజీటీలో 13వ ర్యాంకుతో ఉద్యోగం సాధించినందుకు సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు సన్మానం చేశారు. గ్రామంలోనే ఏడో తరగతి వరకు చదివిన తమ శిష్యుడు చిన్నరాజు ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించడంతో ఉపాధ్యాయులు శాలువకప్పి ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

రేపు విస్తృతస్థాయి సమావేశం

గండేడ్: పరిగిలో 6న కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ప్రతి ఒక్కరు హాజరు కావాలని మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పరిగి నియోజవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో సమావేశం ఉదయం 11గంటల ఉంటుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పకహాజరుకావాలని కోరారు.

సేవాలాల్ ఆలయం కోసం స్థలం కేటాయించండి

నవాబుపేట: సంత్‌సేవాలాల్ ఆలయం మండల కేంద్రంలో నిర్మించేందుకు ప్రభుత్వ స్థలానికి కేటాయించాలని గిరిజన నాయకులు సోమవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. మండల కేంద్రంలో 3 ఎకరాల భూమిని కేటాయించాలని తెలిపారు. డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, తుల సీరాంనాయక్, నీల్యానాయక్, సంతోష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

నవాబుపేట: మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఒబేదుల్లా కొత్వాల్‌ను జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బంగ్లరవి సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల నాయకులతో కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రాంచంద్రయ్య, అజహర్, సలాఉద్దీన్, రమేష్, వెంకటేష్, రాజు, నరేష్ ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అడ్డాకుల: మూసాపేట మండలం అచ్చాయపల్లి వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సుజాత తెలిపారు. గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లలో ఆదివారం రాత్రి ఇసుకతో జాతీయ రహదారి వైపు వెళ్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.